## మినీ కథ




అల్లరి చిల్లరిగా తిరిగి పాడవుతాడేమో నని నాలుగేళ్ళ రవిని కాన్వెంట్‌లో చేర్పించింది అనసూయమ్మ.

అంతకు ముందు బొద్దుగా, ముద్దుగా వుండే రవి కాన్వెంట్‌కి వెళ్ళడం మొదలు పెట్టిన దగ్గరనించి కాస్తా తగ్గటం మొదలు పెట్టాడు. ఎండకు గాలికి తిరగటం కదా అని సరిపెట్టుకుంది అనసూయమ్మ.

కాన్వెంట్ నుండి రాగానే పుస్తకల సంచీ మూలకు గిరాటేసి -"అమ్మా ఆకలమ్మా" అనేవాడు అమాయకంగా.

అనసూయమ్మ కడుపు తరుక్కుపోయేది వాడు అలా అడిగేసరికి. "అయ్యో ఇప్పటి నుంచి చదువులని బిడ్డని అన్యాయం చేస్తున్నానే అని బాధపడేది. కాసేపటికి సరి పెట్టుకునేది.

ఉదయం కాన్వెంటుకు వెళ్ళేటప్పుడు చిన్న టిఫిన్ బాక్స్‌లో ఒక కూర అన్నం కలిపి పంపించేది—

వీడు ఇంటికి వచ్చేరాకముందే ఆకలంటున్నాడు కదా. కాన్వెంటులో సరిగాఅన్నం తినటంలేదేమో-కారంగా వుండి మంచినీళ్ళు ద్రాగి పోతే అన్నం తినటం మానేస్తున్నాడేమోనని అనుకొని-

"ఈ రోజునుండి మజ్జిగన్నం పంపుతాను .... ఎలాగోలా అలవాటు చేసుకుంటాడు...." అనుకుంటూ బాక్స్‌లో అన్నం పెట్టి మజ్జిగ పోసింది...ఉప్పు వేయబోతున్నంతలో రవి వచ్చాడు.

"అమ్మా-ఉప్పు కొద్దిగా వెయ్...." అన్నాడు ముందుకు పడుతున్న జుట్టుని ఎగదోసుకుంటూ.

"వేశాన్లేరా....ఎంత వెయ్యాలో నాకు తెలియదూ...." అంది బాక్స్ మూత పెడుతూ అనసూయమ్మ—

"నీకేమమ్మా చెపుతావు.... ఆయమ్మ తంతుంది...."

"ఎందుకురా?"

"ఉప్పు ఎక్కువైతే...."

"ఉప్పు తక్కువ. ఎక్కువ అని సంగతి ఆవిడకెలా తెలుస్తుంది?" అన్నది అనసూయమ్మ-బాక్స్‌పై చిలికిన మజ్జిగని తుడుస్తూ.

"మజ్జిగలో ఉప్పు కనుక ఎక్కువుంది-ఆవిడకు సయించదట.. నిన్న కూడా మన అప్పారావంకుల్ వాళ్ళ బాబుని కొట్టింది."

రవి ఇంకా ఏవేవో చెపుతున్నాడు.

అనసూయమ్మకు విషయం చూచాయగా అర్థమైంది-వీడు కాన్వెంట్ నుంచి రాగానే ఆకలి....ఆకలి....అంటూ ఎందుకు గోల చేస్తున్నాడో.. మనసు కొచ్చింది.. ఊరకే ఆవిడమీద నింద వేయటం బావుండదని ఒక నిర్ణయానికి వచ్చి రవిని కాన్వెంట్‌కు పంపించింది అనసూయమ్మ.

మధ్యాహ్నం పిల్లల భోజన సమయానికి కాన్వెంట్‌కి వెళ్ళింది-మదర్‌కు వినయంగా నమస్కరించి- "మీ కాన్వెంట్‌లో మీకు తెలియకుండా జరుగుతున్న ఒక నీచకృత్యాన్ని మీకు చూపించటానికి వచ్చాను.. మన్నించండి- ఇలా మాట్లాడవలసి వచ్చినందుకు...." అంటూ మదన్‌ని తనతో రమ్మని ఆయమ్మని చూపించడానికి బయల్దేరింది అనసూయమ్మ.

వేలుతో చూపిస్తున్న దిక్కున చూసి మదర్ ఆశ్చర్యపోయారు .... కోపంతో ఆయమ్మ దగ్గరికెళ్ళారు.... ఆ చెంప, ఈ చెంప వాయించారు.... "ఛీ" అంటూ చీత్కరించారు.

వెంటనే బయటకు గెంటేశారు—

"అమ్మా— ఆకలి—" అంటూ దగ్గర కొస్తున్న రవిని గుండెలకు హత్తుకుంది. అనసూయమ్మ.

—కోలవల్లి ఈశ్వరరావు

## స్వరలహరి

ఆమె గొంతు సుదురమని పాట నేర్పించె
భర్త పట్టుపట్టి—పాప మిపుడు
ఆమె పాట హోరు హడలెత్తగా జేయ
కర్మఫలము తప్పగలదె—నిదగ.

* * *

భర్త పూలుతెచ్చె భార్య గారెలు వండె
ప్రణయ కలహ విరహబాధ ముగియ
అతడు తినెను గారె లామె పూలు ధరించె
ఏకమై షికారు కేగిరి—సరి.

* * *

పెళ్ళికాని ప్రేమ భీతి సంకుచితమ్ము
పెళ్ళి యైన వెనుక ప్రేమలేదు.
ఏమి చేయనౌనో ఇటునుయ్యి అటుగొయ్యి
అనుచు ముదిసెనొకడు నినిద పగమ.

* * *

అన్ని క్లాసులందు నతడె ప్రథముడుగా
చదివి పట్టములను చాల గొనియె
ఇపుడు పట్టమహిషి ఏలుబడిని మాత్ర
మతడు కుడుచు చాల వెతలగాద.

* * *

ఎన్ని బిరుదులున్న ఎంత సంపద యున్న
ఎన్నికలను గెలుచుగొన్న కాని.
ఎన్ని యున్ననేమి ఇంటిలోని అశాంతి.
సున్న జేయు సుఖము—నిని నిని.

* * *

బ్రతుకు రైలుబండి పయనమ్మునందున
ఫస్టు క్లాసు బెర్తు భార్య ప్రేమ
కాని ఒక్కొకప్పుడు కదు వెగటైపోవు
అమితమైన తీపి—గమప మగమ.

* * *

వసుధ యందు శాంతి బాలనాగమ్మగా
చిక్కువడె ఫకీరుచేత నిపుడు
మంచి మనసులెల్ల మారెను శిలలుగా
గరిగ మగరి గరిగ గరిగ మగరి.

* * *

ఒక్కొకప్పుడు చాల చిక్కుల బెట్టును
శుష్కమైన నీతి సూత్ర వితతి.
వలదు వలదు మానవత్వమ్మును హరించు
దంభ నీతి నిష—దాప దనిన.

* * *

కీర్తిశేషులు పంతుల
శ్రీరామశాస్త్రి